క్లుప్తంగా

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న ఎంపీపీ మోతిరాం

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి గురువారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కెస్లాగూడ గ్రామానికి అతి సమీపంలో స్థలాన్ని గుర్తించగా రాళ్లు, రప్పలు ఉండడంతో బ్లాస్టింగ్ చేయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, పీఆర్ఏఈ స్టీవెన్, సర్పంచ్ గుణవంత్‌రావు, నేతలు యూనూస్, బషీర్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ విద్యార్థినికి ఆర్థిక సాయం



పద్మను సన్మానిస్తున్న శ్రీనివాస్

నార్నూర్ : జైనూర్ మండలంలోని కొద్దుగూడ (రాశిమెట్ట) గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని కుమ్ర పద్మ జేఈఈలో ఆల్ ఇండియా 71వ ర్యాంక్ సాధించగా ఆమెను సామాజిక కార్యకర్త చౌహాన్ శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమెకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామంలో పుట్టి ఐటీడీఏ పాఠశాలలో చదువుకుని జాతీయస్థాయిలో 71వ ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. ఈనెల 24 నుంచి గాదిగూడ మండలం పర్సువాడ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ చిన్ను, రాజేశ్వర్ ఉన్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రం తనిఖీ



దుస్తులు పరిశీలిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వస్తువులు, దుస్తులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసే స్తోమత లేని వారికి ఇళ్లల్లో వినియోగించని ఉపయోగకరమైన వస్తువులు అందించాలని సూచించారు.

ఆదివాసీ భవన్‌లో నీటి సౌకర్యం



మోటారు ప్రారంభిస్తున్న దుర్పతబాయి

కెరమెరి: మండలంలోని నెహ్రూనగర్‌లో ఉన్న ఆదివాసీ భవన్‌లో గురువారం జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి నీటి సౌకర్యం కల్పించారు. విద్యుత్ సౌకర్యంతో పాటు మోటారు బిగించారు. గతంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం బోరు వేయగా, జెడ్పీటీసీ మోటారు బిగించి నీటి సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మడావి రఘునాథ్, ఆడా రాంచందర్, కొట్రంగే శ్రీనివాస్, పెందోర్ శ్రీనివాస్, సకారాం, భుజంగ్‌రావు తదితరులు ఉన్నారు.

'రైతుబంధు'కు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారులు

కౌటాల: నూతనంగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. గురువారం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జూన్16వ తేదీ వరకు విరాసత్, భూమి కొనుగోలు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. కొత్తగా నమోదు చేసుకోవడానికి పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్, దరఖాస్తు ఫారంలో వివరాలు నింపి అందజేయాలన్నారు.

దహెగాంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



నింగి వైపు..

రైతన్న చూపు

- మబ్బులు వస్తున్నా కురువని వర్షం
- ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 19 మిల్లీమీటర్లు నమోదు
- గత సంవత్సరం జూన్ 21వరకు 147 మిల్లీమీటర్ల వర్షాపాతం
- మండలంలో 24వేల ఎకరాల్లో పత్తి సాగు

వేడి తగ్గాకే విత్తుకోవాలి

భూమిలోని వేడి తగ్గిన తరువాతనే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. ఒకటి, రెండు వర్షాలు కురువగానే తొందర పడి విత్తుకోవద్దు. భూమి చల్లబడ్డాకే విత్తనాలు విత్తుకోవాలి. వేడి ఉంటే గింజలు మురిగిపోయే అవకాశాలు ఉంటాయి.

– వంశీకృష్ణ, ఏవో, దహెగాం

దహెగాం: వర్షాకాలం ప్రారంభమైనా ఇప్పటికీ వాన జాడ కానరావడం లేదు. వేసవిలోనే పొలాలకు దుక్కులు పెట్టి మృగశిర కార్తెలో విత్తనాలు విత్తుకోవడానికి రైతులు సన్నద్ధం కాగా వరుణదేవుడు కరుణించడం లేదు. గత నాలుగు రోజుల నుంచి కారు మబ్బులు వస్తున్నా వానలు కురవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వానమ్మా.. రావమ్మా అంటూ రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. గత సంవత్సరం ఇప్పటివరకు 80 శాతం మంది రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. కాని ఈ ఏడాది కేవలం 20శాతం మాత్రమే విత్తనాలు విత్తుకొని దీనంగా వర్షం కోసం చూస్తున్నారు.

మండలంలో 24వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 30 వేల ఎకరాలకు పైగా సాగు విస్తీర్ణం ఉండగా అందులో పత్తి 24వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెండేళ్లుగా అతివృష్టి వల్ల పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరుసగా భారీ వరదలు రావడంతో మండలంలో సుమారు 10వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఈ ఏడాది ఖరీఫ్ కలిసి వస్తుందనుకుంటే ఇంకా వర్షాలు కురవడం లేదు. గత వారం రోజుల నుంచి మండలంలో ఖరీఫ్ పనులను రైతులు ముమ్మరం చేశారు. చేలను చదును చేసి, దేవునిపై భారం వేసి వరుణ దేవుడు కరుణించకపోతాడా అంటూ విత్తనాలు విత్తుకుంటున్నారు. గత ఏడాది జూన్ 21 వరకు మండలంలో 147 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు కేవలం 19 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. వర్షాకాలం ప్రారంభమై 20రోజులు దాటినా ఒక్క పెద్ద వాన కూడా పడలేదని, దీంతో భూమిలో పదన లేదని రైతులు వాపోతున్నారు. కాగా పెద్ద వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయాధికారులు చూచిస్తున్నారు.

పత్తి విత్తనాలు పెట్టినం



గత నాలుగు రోజుల నుంచి మబ్బులు వస్తున్నాయి. వాన పడుతుందని ఆశతో నాలుగు ఎకరాల్లో పత్తి పెట్టినం. దేవుని మీద భారం వేసి పత్తి వేసినం. వర్షం పడితే పత్తి మొలకెత్తుతుంది. ఒక్క వాన పడితే బాగుండు. లేకుంటే మళ్లీ విత్తనాలు విత్తుకోవాల్సి వస్తుంది.

– సామెర రాజన్న, రైతు, దహెగాం

ఇంకా విత్తలేదు



పోయిన సంవత్సరం జూన్ 20న పత్తి పెట్టిన. అప్పుడు వానలు బాగా పడ్డాయి. పెట్టిన పత్తి మొలిసింది. కానీ ఈ ఏడాది ఇంకా ఒక్క వాన కూడా పడలేదు. భూమి చదును చేసి ఉంది. పెద్ద వానలు పడ్డ తరువాతనే పత్తి పెడదామని చూస్తున్నా.

– చంద్రయ్య, రైతు, దహెగాం

ఘనంగా అమరుల సంస్మరణ దినోత్సవం



సిర్పూర్(టి): మౌనం పాటిస్తున్న అధికారులు



కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలంగాణ అమర వీరుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల కోసం ఐదు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సదర్శన్, వైద్యాధికారి వెంకటేశ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏపీఎం జగదీశ్వర్, ఈసీ ఐక్యనాయక్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, గోయగాం హెచ్ఎం నల్లగొండ రమేశ్, తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో తెలంగాణ సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తెలంగాణ అమర వీరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అమరవీరులకు నివాళులర్పించారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, మంగిలాల్, ఉపసర్పంచ్ తోట మహేశ్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో రాజేశ్వర్, ఎస్సై రమేశ్, ఎంపీవో మహేందర్ రెడ్డి, నాయకులు చునార్కర్ ఉమాజీ, దుర్గం విక్రమ్, అఖిల్ అహ్మద్, ఇఫాత్‌హుస్సేన్, మోయిజ్ పాల్గొన్నారు.

రెబ్బెన: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలు త్యాగం చేసిన అమరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేశ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీలు మధునయ్య, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, ఎంపీవో అంజద్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో చివరిరోజు ఆయా గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ సాధనలో అమరుల త్యాగాలు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ చీపురుశెట్టి శంకర్ అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు స్వదేశ్‌శర్మ, ఎంపీడీవో గౌరీశంకర్, మండల కోఆప్షన్ సభ్యులు బాబా, ఎంపీటీసీ కుమార్, అమిత్‌దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: అమరుల త్యాగాలు మరువలేనివని ఎంపీపీ బి.విశ్వనాథ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అమరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్తూపం వద్ద మౌనం పాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయన్న, సీఐ సాదిక్‌పాషా, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మౌనిక, సర్పంచ్ మౌనిక్, ఎంపీటీసీ మనీష్, తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: స్వరాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన అమరులను స్మరించుకోవాలని ఎంపీపీ కంబగౌని సులోచన అన్నారు. గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమరుల సంస్మరణ వేడుకలు నిర్వహించారు. ముందుగా అమరుల ఆత్మకు శాంతి జరగాలని మౌనం పాటించారు. ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, ఎస్సై సనత్‌కుమార్, సర్పంచ్ పుప్పాల లక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే హైమద్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గురువారం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వేతనాల్లో వృత్తిపన్ను కోత నిలిపివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఓదెలు

రెబ్బెన: ఏరియాలో పని చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల వేతనాల్లో వృత్తిపన్ను పేరుతో కోత విధించడం అన్యాయమని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బెల్లంపల్లి ఏరియా గౌరవ అధ్యక్షుడు ఓదెలు అన్నారు. గురువారం ఏరియా ఇన్‌చార్జి ఎస్వోటూజీఎం ఉమాకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో పని చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు మే నెల జీతాల నుంచి వృత్తిపన్ను పేరుతో ఆర్ఎంజీ కాంట్రాక్టర్ మహేందర్‌గౌడ్ ఒక్కో సెక్యూరిటీ గార్డు నుంచి రూ.300 చొప్పున కోత విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సింగరేణిలో ఎక్కడా లేని విధంగా కేవలం బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ వేతనాల్లో కోతలు విధించడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జాక్సన్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సహాయ కార్యదర్శి కేశవ్, కోశాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నార్నూర్: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగ తగిలి మండల కేంద్రంలోని ఆడే అశ్విన్‌కు చెందిన ఆవు మృతి చెందింది. ఆవు విలువ రూ. 50,000 వరకు ఉంటుందని, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

కుక్కల బెడద నివారించాలి

తాండూర్: మాదారం గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కోతులు, కుక్కల బెడదను నివారించాలని నిరసన తెలిపారు.

కాలువ మరమ్మతులకు కృషి



కెనాల్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: మండల పరిధిలో ఉన్న వట్టివాగు ప్రధాన కాలువల మరమ్మతుల కోసం కృషి చేస్తానని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండలంలోని నక్కలగూడ సమీపంలో ఉన్న వట్టివాగు ప్రధాన కాలువను పరిశీలించారు. సిమెంట్ కెనాల్‌కు పగుళ్లు రావటంతో ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే నీరు వృథాగా పోతోందని రైతులు జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ సమస్యను ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు శ్రీనివాస్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

డిస్పెన్సరీలో 'స్వచ్ఛతా పక్వాడా'



చెత్త ఊడుస్తున్న వైద్య సిబ్బంది

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీలో గురువారం ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్పెన్సరీ ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. గడ్డి, ముళ్లపొదలు తొలగించారు. డీవైసీఎంవో ఆర్ శౌరీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్టాలిన్, అనుముల సత్యనారాయణ, సుదర్శన్, జయశీల తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకానికీ ఓ లెక్కుంది!

- పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు
- విద్యార్థుల వారీగా ప్రత్యేక సంఖ్య
- ఆధార్ ఉన్నవారికే పంపిణీ



పుస్తకాలపై ముద్రించిన ప్రత్యేక సంఖ్య

కెరమెరి: విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు చేరేలా క్రమసంఖ్య కేటాయించింది. దీని ఆధారంగా పుస్తకం ఏ విద్యార్థి వద్ద ఉందో తెలుసుకోవచ్చు. కాగా మండలానికి 32,324 పాఠ్యపుస్తకాలు చేరాల్సి ఉండగా ఇప్పటివరకు 18,320 పాఠ్యపుస్తకాలు మాత్రమే చేరాయి. మండలంలో మొత్తం 90పాఠశాలలు ఉన్నాయి. అందులో ఉన్నత పాఠశాలలు 8, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 78 ఉండగా వాటిలో చైల్డ్‌ఇన్ఫో ప్రకారం 5225 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

క్రమసంఖ్య ఆధారంగా..

ఇక నుంచి ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాలు దారి తప్పే అవకాశం లేదు. ప్రతీ పాఠ్యపుస్తకంపై వరుస సంఖ్య కేటాయిస్తూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. రాష్ట్రంలోని జిల్లాలకు, మండలాలకు ప్రత్యేక కోడ్‌లను నిర్ణయించి వాటి ఆధారంగా పుస్తకాలపై క్రమసంఖ్య ముద్రించింది. వీటిని విద్యార్థులకు అందజేసిన తర్వాత జిల్లా, మండల కోడ్‌లను ఇంటర్‌నెట్‌లో నమోదు చేస్తారు. మండల విద్యాశాఖ పాఠశాలలకు అందజేసిన క్రమసంఖ్యల ఆధారంగా ప్రణాళికలు రూపొందించారు. పాఠ్యపుస్తకాలు కావాలంటే విద్యార్థులకు ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది.

నంబర్ ఆధారంగా పంపిణీ



మండలంలోని పాఠశాలలకు ఇప్పటికే పుస్తకాలు చేరాయి. చైల్డ్‌ఇన్ఫో ఆధారంగా పాఠ్య పుస్తకాలు మండలానికి అందజేశారు. ఏ పాఠశాలకు ఎన్ని పుస్తకాలు ఇవ్వాలో నిర్ణయించి ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు అందజేశాం. నంబర్ ఆధారంగా పుస్తకాలను పంపిణీ చేశాం.

– కె. సుధాకర్, ఎంఈవో, కెరమెరి

నాగేశ్వర్‌రావుకు అవార్డు దక్కడం అభినందనీయం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి

రెబ్బెన: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులకు అందించే ప్రతిష్ఠాత్మకమైన లైమ్‌లైట్ అవార్డు జిల్లాకు చెందిన నాగేశ్వర్‌రావుకు దక్కడం అభినందనీయని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గురువారం గోలేటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994 నుంచి తెలుగు రాష్ట్రాల్లో వాసవి గ్రూప్ ద్వారా సామాజిక సేవా దృక్పథంతో పని చేస్తున్న వారికి అందించే ప్రతిష్ఠాత్మకమైన లైమ్‌లైట్ అవార్డు కోసం ఆన్‌లైన్ ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఓటింగ్‌లో కాగజ్‌నగర్‌కు చెందిన రాచకొండ నాగేశ్వర్ మూడువేల ఓట్ల మెజార్టీతో గెలుపొందటం గర్వకారణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి సుగుణాకర్, నాయకులు సతీశ్, రాజశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈజ్‌గాం ఆలయంలో కేంద్రమంత్రి పూజలు



పూజలు చేస్తున్న పురుషోత్తం రూపాల

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో గురువారం కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాల ప్రత్యేక పూజలు చేశారు. కాగజ్‌నగర్ పర్యటనలో భాగంగా ఈజ్‌గాం శివమల్లన్న ఆలయాన్ని సందర్శించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నజ్రుల్‌నగర్‌లోని వేద మందిరంలో కార్యకర్తలతో సమావేశమై 9ఏళ్ల బీజేపీ పాలన గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు అల్లాపూర్ శ్రీనివాస్, అయ్యంగారి భూమయ్య, మాజీమంత్రి అమర్‌సింగ్ తిలావత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరీష్‌బాబు, కొంగ సత్యనారాయణ, ఆజ్మీరా ఆత్మారాం, నాయకులు కాళీదాసు ముజేందర్, దోని శ్రీశైలం, మురళి, కొలిపాక కిరణ్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, ముత్తు అశోక్, విశాల్‌ఖాంద్రె తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రెబ్బెన: గత ఏడాది అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా నాయకురాలు పాగిడి మాయ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం మధ్యాహ్న భోజనాలకు రూ.2వేలు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించినా నేటికీ అమలు కాలేదన్నారు. పెరిగిన వేతనాలకు సంబంధించిన జీవోను విడుదల చేసి పెరిగిన వేతనాలు అందజేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనాల బిల్లులు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. జిల్లా నాయకులు పద్మ, ఈశ్వరీ, పోశక్క, భూమవ్వ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో సంపూర్ణ ఆరోగ్యం



బుక్‌లెట్ అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్: ఫోర్టిఫైడ్ బియ్యంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్‌తో కలిసి మండలంలోని రేషన్ డీలర్లకు ఫోర్టిఫైడ్ బియ్యం బుక్‌లెట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పోషకాలతో కూడిన బలవర్ధకమైన బియ్యం ఫోర్టిఫైడ్ రైస్ అన్నారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు, ఉపాధ్యక్షుడు జాడె ఆత్మారాం, నర్సింహస్వామి, తిరుపతి, సుధాకర్, సత్యనారాయణగౌడ్, శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.

'కేజీబీవీలో చేరండి'

కెరమెరి: మండలంలోని కేజీబీవీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాలనుకునే వారు వెంటనే చేరాలని ఎస్‌వో మీనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో 35, బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. నాణ్యమైన విద్యతో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆసిఫాబాద్‌రూరల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో బ్రహ్మణవాడ మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు యోగాతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.